నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, మంగళవారం 10 డిసెంబర్ 2024 HYDERABAD


## 15 ఏండ్ల వాహనాలు స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేసుకుంటే..

సిటీబ్యూరో: కాలం చెల్లిన వాహనాలపై ఆర్టీఏ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 15 ఏండ్లు నిండిన వాహనాలను స్వచ్ఛందంగా స్క్రాపింగ్ చేసుకుంటే పలు రాయితీలు పొందవచ్చనని అధికారులు ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే మహానగరంలో కాలం చెల్లిన వాహనాలు వేలాదిగా ఉన్నాయి. ఇవన్నీ రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. అధికారులు తనిఖీల్లో కొన్ని పట్టుబడుతున్నా.. చాలా వరకు ముఖ్యంగా స్కూల్ బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు గడువు ముగిసినా తిరుగుతున్నాయి. అధికారులు వీటిపై దృష్టి సారించి ప్రత్యేక తనిఖీలు సైతం చేస్తున్నారు. అందులో భాగంగా వాహనదారులకు స్క్రాపింగ్ ఉపయోగాలను వివరిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలైతే 20 ఏండ్ల లోపు స్క్రాప్ చేస్తే.. ప్రతి ఏటా పన్నుపై 10 శాతం రాయితీ వస్తుంది. సొంత వెహికల్ 15 ఏండ్లు నిండిన తర్వాత స్వచ్ఛందంగా స్క్రాపింగ్ వస్తే సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ వస్తుంది. రెండేండ్లలోపు అదే విలువ గల వాహనం కొంటే ఎంవీ ట్యాక్స్‌లో మినహాయింపు ఉంటుంది. ఈ అంశాలపై అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

## రెండు రోజుల్లో మోస్తరు వాన



సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో దక్షిణ, నైరుతి దిశల నుంచి వీస్తున్న కింది స్థాయి గాలుల ప్రభావంతో రాబోయే 2రోజులు గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 29.4, కనిష్ఠం 21.5 డిగ్రీలు, గాలిలో తేమ 77 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# చరిత్ర తెలియని దద్దమ్మలు

## కాంగ్రెస్ సన్నాసులతో అప్రమత్తంగా ఉండాలి




- ఏ పథకమూ అమలు చేయకుండానే విజయోత్సవాలా?
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. బీఆర్ఎస్‌దే గెలుపు
- 420 హామీలపై పోరాటాలకు సిద్ధం కావాలి
- మేడ్చల్ లో జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

మేడ్చల్/దుండిగల్: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, 90 నుంచి 100 సీట్లు గెలుస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం గండిమైసమ్మలో నిర్మించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. రుణ మాఫీ చేసినట్లు గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో ఒక్కరికీ రుణమాఫీ ఎందుకు కాలేదని కేటీఆర్ ప్రశ్నించారు. కేటీఆర్ సభలో ప్రసంగిస్తున్న సమయంలో రుణ మాఫీకి సంబంధించిన పలు పత్రాలను బాధిత రైతులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ ఒక్క ఘట్‌కేసర్ మండలంలోనే రుణమాఫీ అయ్యే రైతులు 1189 మంది ఉంటే ఒక్కరికీ కూడా రుణమాఫీ కాలేదని రికార్డులు చూపిస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం రుణమాఫీ రైతులందరికీ చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ సన్నాసులకు ఇదొక్కటి సాక్ష్యం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు అమలు జరిగేలా ప్రజలకు మద్దతుగా ప్రజా పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. చరిత్రను తెలుసుకోలేని దద్దమ్మలు కాంగ్రెస్ సన్నాసుల పట్ల అప్రమత్తంగా ఉండకపోతే తెలంగాణను నిండా ముంచుతారన్నారు.

### ఏ ఎన్నిక వచ్చినా..

రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా.. బీఆర్ఎస్‌దే గెలుపు ఉండేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఏ ఒక్క పథకం అమలు చేయకుండానే ప్రజాపాలన పేరిట విజయోత్సవాలను నిర్వహిస్తూ ప్రజా సంపదను దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే బూత్ స్థాయి నుంచి సభ్యత్వాలను చేస్తూ.. పూర్తిస్థాయిలో కమిటీలను వేసుకొని పార్టీకి పునర్వైభవాన్ని తీసుకొచ్చేలా నూతన ఒరవడికి శ్రీకారం చుడుతామన్నారు.



మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు





కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, సురభి వాణీదేవి, మహమూద్ అలీ, శంభీపూర్ రాజు తదితరులు



సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

## మార్కులు తగ్గితే చర్యలే..!




సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని ఎమ్మార్వో కార్యాలయాల్లో సేవలు ఏ విధంగా అందుతున్నాయి? నిర్ణీత సమయంలోపు సంబంధిత ధ్రువపత్రాలు జారీ అవుతున్నాయా? పెండింగ్‌లో దరఖాస్తులకు కారణాలు? ఇలా తదితర అంశాలన్నింటిపై వివరాలు సేకరించి సదరు కార్యాలయాలకు డిప్యూటీ కలెక్టర్లు మార్కులు ఇస్తున్నారు. ఆ మార్కుల ఆధారంగా సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నారు. హైదరాబాద్ కలెక్టర్ ఆదేశాలనుసారం డిప్యూటీ కలెక్టర్లు వారానికి మూడు ఎమ్మార్వో కార్యాలయాలను తనిఖీ చేసి వివరాలు సేకరిస్తారు. ఆ వివరాల ఆధారంగా కలెక్టర్‌కు నివేదిక ఇస్తున్నారు. పలు సేవల జాబితానుసారం వంద మార్కులుగా నిర్ణయించి.. కార్యాలయాల పరిస్థితిని పరిశీలించి మార్కులు వేస్తున్నారు. ఇందులో 60కి తక్కువగా ఉంటే సదరు అధికారులపై చర్యలు తీసుకోనున్నారు. కార్యాలయానికి వస్తున్న ప్రజల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుంటున్నామని ఓ అధికారి తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి న్యాయవాదులు

## సంబంధం లేని ప్రశ్నలతో పట్నంను ఇబ్బందిపెట్టారు

- లగచర్ల కేసులో ఇరికించేలా వ్యవహరించారు
- మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తరఫు న్యాయవాదులు
- ముగిసిన రెండు రోజుల పోలీసుల కస్టడీ.. కోర్టుకు తరలింపు

కొడంగల్: రైతులు చేపట్టిన న్యాయపోరాటాన్ని రాజకీయ కక్షగా మార్చేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరఫు న్యాయవాదులు రాంచందర్, లక్ష్మణ్, శుభప్రద్ పటేల్ పేర్కొన్నారు. రెండు రోజుల కస్టడీ అనంతరం పోలీసులు మాజీ ఎమ్మెల్యేను సోమవారం కోర్టులో హాజరు పర్చిన సందర్భంగా వారు మా ట్లాడారు. లగచర్ల కేసును ఎన్నో మలుపులు తిప్పేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని.. అందువల్లే పట్నం నరేందర్‌రెడ్డికి బెయిల్ రావడంలో ఆల స్యమవుతున్నదన్నారు. కస్టడీలో పోలీసులు ఘటనకు సంబంధం లేని ప్రశ్నలతో ఆయన్ను ఇబ్బందికి గురి చేశారని..ఆ కేసులో ఇరికించేలా వ్యవహరించారన్నారు. ఈ విషయాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లామన్నారు. మాజీ ఎమ్మెల్యే పోలీసులకు ఎటువంటి కన్ఫెషన్ ఇవ్వలేదన్నారు. రెండు రోజుల కస్టడీ అనంతరం న్యాయవాదులకు చెప్పకుండా గుట్టుచప్పుడు కాకుండా పోలీసులు కోర్టులో హాజరు పర్చడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదన్నారు. నరేందర్‌రెడ్డితో పాటు 71 మందిపై అన్యాయంగా కేసులు పెట్టారన్నారు. 20 రోజులు దాటినా అరెస్టైన వారికి బెయిల్ మంజూరు కావడం లేదన్నారు. ఫార్మాను ప్రభుత్వం విరమించుకున్నప్పుడు రైతులు, ప్రజలపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ఫార్మాను రద్దు చేసిన మాదిరిగానే లగచర్ల కేసును రద్దు చేసి చేయాల న్నారు. మాజీ ఎమ్మెల్యే నిర్దోషిగా బయటికి వస్తారని న్యాయవాదులు స్పష్టం చేశారు.


### కొడంగల్ కోర్టుకు పట్నం ..

లగచర్ల ఘటనలో ప్రధాన నిందితుడిగా పేర్కొనబడిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని రెండు రోజుల పోలీసు కస్టడీ అనంతరం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు రెండు రోజులుగా ఆయన్ను వికారాబాద్‌లో విచారించారు. సోమవారం జైలుకు తరలించే ముందు స్థానిక ప్రభుత్వ దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనెల 13వ తేదీ వరకు రిమాండ్‌లో భాగంగా పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. మాజీ ఎమ్మెల్యేను చూ సేందుకు బీఆర్ఎస్ నాయకులు కోర్టు ముందు పడిగాపులు కాసినా ఏ ఒక్కరినీ అనుమతించలేదు.

# సొంతిల్లు దుర్లభం

## విలీన పంచాయతీల్లో భారీగా పెరిగిన ధరలు

- సామాన్యులకు సొంతింటి కల మరింత ప్రియం
- ఇంటి అనుమతులకు ఐదు రెట్లు పెరిగిన వ్యయం
- పర్మిషన్ ప్రక్రియలోనూ భారీగా వ్యత్యాసం
- మార్కెట్ విలువ పెంపుతో తప్పని రిజిస్ట్రేషన్ భారం




*మేడ్చల్ జిల్లాలోని పూడూరు గ్రామాన్ని ఇటీవల మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఇన్నాళ్లు ఆ గ్రామంలో ఇల్లు కట్టుకోవాలంటే 1000చదరపు అడుగులకు గరిష్ఠంగా రూ. 2వేలలోపు నిర్మాణ చార్జీలు చెల్లిస్తే.. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చేవారు. ఇటీవల విడుదలైన విలీన ఆర్డినెన్స్‌తో పూడూరు వాసులు 1000 చదరపు అడుగుల ఇంటికి ఏకంగా రూ. 10వేలు స్థానిక మున్సిపాలిటీకి చెల్లించుకోనున్నారు. అదే స్థలంలో నాన్ రెసిడెన్షియల్ నిర్మాణం చేపడితే ఆ చార్జీలు రూ.20వేల నుంచి రూ. 50వేల పైమాటే. ఇదొక పూడూరు గ్రామస్తుల సమస్యనే కాదు... ఔటర్ రింగు రోడ్డు చుట్టూ ఉన్న 13మున్సిపాలిటీల్లో విలీనమయ్యే 51 గ్రామాల జనాలపై ఈ బిల్డింగ్ చార్జీలు భారం పడనున్నది.*

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): విలీన గ్రామాల్లో సొంతింటి కల మరింత ప్రియం కానున్నది. జీవితంలో ఒకసారే కట్టుకునేదే అయినా.. అనుమతుల కోసమే అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. గోటితో పోయేది గొడ్డలి దాకా వచ్చినట్టు.. గ్రామ పంచాయతీలో 2వేల రూపాయలతో వచ్చే ఇంటి అనుమతులకు ఇప్పుడు 5 నుంచి 10 రెట్లు పెరుగుతున్నది. ఇన్నాళ్లూ ఇంటి కోసం కల కన్న సామాన్యులు.. ఇప్పుడు అనుమతుల కోసం మున్సిపాలిటీ చుట్టూ తిరగలేక ఉన్న రేకుల షెడ్డుతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది.

### గ్రామాల్లో ఇలా...

| | |
|---|---|
| పక్కా భవనానికి రూ. 10/చ. మీటర్ రూ. రెండు వేలకు మించకుండా... | |
| నాన్ రెసిడెన్షియల్ రూ. 20/చ.మీటర్ | |
| నిబంధనలు అతిక్రమిస్తే రూ. 1000 | |
| బిల్డింగ్ అప్లికేషన్ కోసం రూ. 10 | |

### 100 చ.మీ ఇంటి అనుమతులకు అయ్యే ఖర్చు

| | |
|---|---|
| పక్కా భవనానికి | రూ. 1000 |
| నాన్ రెసిడెన్షియల్ | రూ. 2వేలు |
| నిబంధనలు అతిక్రమిస్తే | రూ. 1000 |

### మున్సిపాలిటీల్లో...

| రెసిడెన్షియల్ | |
|---|---|
| 500 చ.మీటర్ల వరకు | రూ. 10వేలు |
| 500 చ.మీటర్లు దాటితే | రూ. 20వేలు |

**కమర్షియల్**

1000చ.మీటర్ల వరకు రూ. 25వేలు

1000 చ. మీటర్లు దాటితే రూ. 50వేలు

**ఇండస్ట్రీ భవనాలకు**

2వేల చ.మీటర్ల వరకు రూ. 50వేలు

2వేల చ. మీటర్లు దాటితే రూ. 1లక్ష

ఇనిస్టిట్యూషనల్ భవనాలు రూ. 40వేలు

మతపరమైన భవనాలకు రూ. 50వేలు

### మరింత భారం

వంద గజాల జాగలో రేకుల షెడ్డు, పెంకుటిల్లు కట్టుకుని దర్జాగా బతికేసే ఆ పల్లెవాసిపై బిల్డింగ్ అనుమతుల పేరిట భారీ మొత్తంలో భారం పడుతున్నది. మున్సిపాలిటీ పరిధిలో పెరుగనున్న మార్కెట్ వాల్యూతో కొత్తగా సొంతింటిని కొనుగోలు చేయాలనుకునే వారి లెక్కలు కూడా మారిపోతున్నాయి. ఇన్నాళ్లు వేసుకున్న బడ్జెట్ అంచనాలన్నీ తలకిందులు అవుతున్నాయి. హడావుడిగా తీసుకువచ్చిన విలీన ప్రక్రియతో భవన నిర్మాణ, రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెరగనున్నాయి. అధికారుల చుట్టూ తిరిగితేగానీ, అనుకున్న సమయానికి అనుమతులిచ్చే ఆన్‌లైన్ వ్యవస్థను ఇప్పటికే కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేసింది. అనుమతులు దేవుడెరుగు పేదోడి జేబుకు చిల్లు పెట్టే బిల్డింగ్‌చార్జీల భారాన్ని ఎలా భరించాలనేది పంచాయతీలోని ప్రజలను కలవరపెడుతున్నది.

### భారీ వ్యత్యాసం.. ఐదింతల చార్జీలు

గ్రామాల్లో బిల్డింగ్ అనుమతులు తీసుకోవాలంటే రూ. 2వేల లోపు ఖర్చుతో పూర్తయ్యే వ్యవహారాన్ని అవే గ్రామాలను మున్సిపాలిటీల్లో కలిపి ఐదింతలు చార్జీలు వసూలు చేయనుంది. గ్రామాల్లో ఉండే ఆర్థిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా బిల్డింగ్ చార్జీలును పంచాయతీరాజ్ నిర్ణయించింది. కానీ మున్సిపాలిటీల్లో మాత్రం ఇంటి విస్తీర్ణం బట్టి చార్జీలు వసూలు చేయాలనే నిబంధన ఉన్నది. విలీనం పేరుతో ఊరు నుంచి మున్సిపాలిటీకి వచ్చిన సంబురమే తప్ప... చార్జీల మోత సామాన్యుడికి షరాఘాతంగా మారుతున్నది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో కుదేలైపోతున్న బడుగుజీవుడు ఇకపై ఐదురెట్లు పెరిగిన భవన నిర్మాణాల చార్జీల భారం కూడా మోయాల్సి వస్తున్నది. అదే సమయంలో అనుమతుల ప్రక్రియ మరింత జఠిలం కానున్నది. కార్యాలయాల చుట్టూ తిరిగితేగానీ వ్యవహారాన్ని చక్కబెట్టుకోలేని దుస్థితి వస్తున్నది.

### మారనున్న మార్కెట్ విలువ

గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం ద్వారా స్థానికంగా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నిర్దేశించిన భూముల మార్కెట్ విలువ కూడా మారనున్నది. కొత్తగా మున్సిపాలిటీల్లో మారిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే అదనంగా ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మేడ్చల్ జిల్లా పరిధిలో బండామాదారం గ్రామ పరిధిలో ఉండే 150 గజాల జాగను రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే మార్కెట్ విలువపై రూ.77వేల స్టాంప్ డ్యూటీ, రూ. 28వేల రిజిస్ట్రేషన్ చార్జీలతో కలిపి మొత్తంగా రూ. 1.06లక్షలు చెల్లించాల్సి వచ్చేది. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోకి మారిన తరువాత అదే 150 గజాల ఇంటికి స్టాంప్ డ్యూటీ రూ. 1.18లక్షలు, రిజిస్ట్రేషన్ ఫీజులు రూ. 10వేల చొప్పున మొత్తంగా రూ. 1.61లక్షలు చెల్లించాల్సి వస్తుంది. విలీన ప్రక్రియతో రిజిస్ట్రేషన్ చార్జీల్లో ఏకంగా రూ. 60వేల వ్యత్యాసం వచ్చింది.